సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం । 22 । జూలై । 2024



వైభవంగా బోనాలు..

శ్రీఆంథోల్ మైసమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. - 8లో



జల్సాల కోసం చోరీలు

జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



రోడ్లన్నీ బురదమయం

మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు జిల్లా వ్యాప్తంగా రహదారులన్నీ బురదమయంగా మారాయి. - 9లో

న్యూస్‌రీల్

సెర్ప్‌లో బదిలీలు ఎప్పుడో?

భువనగిరి : వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సోమవారం (నేడు) ముగిసే అవకాశం ఉంది. కానీ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో మాత్రం పదేళ్లుగా ఎలాంటిబదిలీలు జరగలేదు. సెర్ప్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 372 మంది పని చేస్తున్నారు. ఇందులో యాదాద్రిలో 71, సూర్యాపేట 78, నల్లగొండ జిల్లాలో 223 మంది ఉన్నారు. వీరిలో ఎంఎస్ సీసీ స్థాయినుంచి డీపీఎం హోదా వరకు ఉన్నారు. ఏపీఎం జోనల్ స్థాయి, డీపీఎం స్టేట్ స్థాయి పోస్టుగా పేర్కొంటారు. వీరిలో కొందరు 12 ఏళ్లుగా ఒకే కేడర్‌లో పనిచేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా వీరి విషయానిన పట్టించుకోలేదు. దీంతో చాలాకాలంగా ఒకే జిల్లాలో పనిచేస్తున్నారు. ఇటీవల ఉద్యోగులు సెర్ప్ సీఈఓను కలిసి తమ సంస్థలో కూడా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కాగా ఈ విషయంపై రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం నుంచి నిర్ణయం వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్ : రైతుబీమా పథకం కోసం అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ ఆదివారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు 1965 ఆగస్టు 14 నుంచి 2006 ఆగస్టు 14వ తేదీ మధ్య జన్మించి ఉండాలని, 2024 జూన్ 28లోపు పట్టాదారు పాస్‌బుక్ పొంది ఉండాలన్నారు. కొత్తగా పాస్ బుక్ పొందిన రైతులు, ఇదివరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు సంబంధిత రైతువేదికలో ఏఈఓను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు గడువు ఆగస్టు 5లోగా అవకాశం ఉందని, అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భానుచందర్



భానుచందర్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షురాలు శృతిముకిరి

భూదాన్‌పోచంపల్లి : తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరుకు చెందిన కాసుల భానుచందర్ నియామకం అయ్యారు. ఈమేరకు ఆదివారం రాష్ట్ర అధ్యక్షురాలు శృతిముకిరి నియామక పత్రం అందజేశారు. ప్రధానకార్యదర్శిగా జె.సందీప్, కోశాధికారిగా కిషోర్‌గౌడ్ నియమితులయ్యారు.

గీత కార్మికులకు సేఫ్టీ మోకులు ఇవ్వాలి



మాట్లాడుతున్న కేజీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రామన్నపేట : కల్లుగీత కార్మికులందరికీ సేఫ్టీ మోకులు ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాములు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం రామన్నపేటలో జరిగిన కేజీకేఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లుగీత వృత్తి ప్రమాదకరమని, ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 520 మంది, యాదాద్రి జిల్లాలో 80 మంది గీతకార్మికులు తాటిచెట్లపై నుంచి పడి ప్రమాదాలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు రాగీరు కిష్టయ్య మాట్లాడుతూ నందనం గ్రామంలో నీరా ఉత్పత్తి కేంద్రం పనులు ప్రారంభించాలని కోరారు. ఎర్ర రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బావండ్లపల్లి బాలరాజు, పులి భిక్షం, కూనూరు మల్లేశం, మునుకుంట్ల లెనిన్, బైరు రామక్రిష్ణయ్య, పబ్బు గంగాధర్, పబ్బు వెంకన్న తదితరులు ఉన్నారు.

● జయజయ సాయి



గురుపౌర్ణమి సందర్భంగా మోత్కూరు ఆలయంలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

ముసురు వాన

భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట : అల్పపీడన ప్రభావంతో జిల్లాను మూడు రోజులుగా ముసురు వాన కమ్ముకుంది. శుక్రవారం రాత్రి మొదలై ఆదివారం సాయంత్రమైనా పలు చోట్ల తేలికపాటి జల్లులు కురుస్తూనే ఉన్నాయి. అత్యధికంగా రామన్నపేట మండలంలో 12 మి.మీ.,ఆలేరు 8.3 మి.మీ., గుండాల 8 మి.మీ., వర్షపాతం నమోదైంది. వర్షానికి పత్తి, కంది పంటలు ప్రాణం పోసుకుంటున్నాయి. పలు చోట్ల భూముల్లో నీరు నిలవడంతో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. అదే విధంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ నిండడంతో రెండు గేట్లు తెరిచారు. దీంతో మూసీకి వరద ప్రవాహం పెరిగింది.



మల్లాపురంలో మడిని సిద్ధం చేస్తున్న రైతు



జూలూరు శివారులో వర్షంలోనే వరి నాట్లు వేస్తున్న మహిళలు



జూలూరు - రుద్రవెల్లి మధ్య ఉరకలేస్తోన్న మూసీ

బెటాలియన్ బెంగ!

సంస్థాన్‌నారాయణపురం సమీపంలో పోలీసు బెటాలియన్ ఏర్పాటుకు ప్రతిపాదన





సర్వే నంబర్ 255 భూముల్లో రైతులు సాగు చేసిన పత్తి, టేకు చెట్లు

- ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో కలవరం
- దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములు పోతాయని మనోవేదన
- బిక్కుబిక్కుమంటున్న 130 కుటుంబాలు
- వారం రోజులుగా ఆందోళన కార్యక్రమాలు

సంస్థాన్‌నారాయణపురం : రాళ్లు, రప్పలతో గుట్టలుగా పేరి ఉన్న ప్రాంతమది. అటువంటి భూములను చదును చేసి తరతరాలుగా సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి.. 130 కుటుంబాలు. అది ప్రభుత్వ భూమి కావడమే వారికి శాపంగా మారింది. పోలీసు బెటాలియన్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు చేయడంతో రైతుల్లో కలవరం మొదలైంది. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములు పోతాయని, జీవనోపాధి కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోవాలంటూ వారం రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు.

144 ఎకరాల ప్రభుత్వ భూమి..

సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రానికి కూతవేటు దూరంలో సర్వే నంబర్ 255లో 144 ఎకరాల 15 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. 11 ఎకరాలు పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) ఆధీనంలో ఉండగా, 2 ఎకరాల 15 గుంటల్లో గాంధీ నగర్ తండా ఉంది. మిగతా భూమిలో దాదాపు 80 సంవత్సరాలుగా తాతల తరాల నుంచి 130 కుటుంబాలు వ్యవసాయం చేసుకుంటున్నాయి. పత్తితో పాటు ఇతర ఆరుతడి పంటలను పండిస్తున్నారు. వీటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇట్టి భూములకు గతంలో పాత పట్టాదార్ పాస్ పుస్తకాలు కూడా అందజేశారు. పాస్‌బుపుస్తకాలపై బ్యాంకు రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు కూడా అందుకున్నారు. కాగా హైదారాబాద్‌కు 100 కిలో మీటర్ల పరిధిలో పోలీసు బెటాలియన్ ఏర్పాటు చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంనుంచి ఆదేశాలు రావడంతో స్థలం కోసం ఉన్నత అధికారులు భూములను పరిశీలిస్తున్నారు. పరిశీలనలో భాగంగా సంస్థాన్ నారాయణపురం సమీపంలోని సర్వే నంబర్ 255లోని భూములను కూడా పరిశీలించారు. ఇది గమనించిన రైతులు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలకు వెళ్లి ఆరా తీశారు. పోలీసు బెటాలియన్ ఏర్పాటు చేసే ప్రతిపాదన అని తెలియజేయడంతో రైతులు ఆందోళన బాట పట్టారు.

ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులు

సర్వే నంబర్ 255 భూముల్లో పోలీసు బెటాలియన్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్‌చేస్తూ రైతులు గత వారం రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. సంస్థాన్‌నారాయణపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి తమ గోడు విన్నవించారు. కలెక్టరేట్‌కు వెళ్లి తమ గోడు వినిపిస్తూ డిజిటల్ పాస్ బుక్కులు ఇవ్వాలని అధికారులను కోరారు.

రాజకీయ పార్టీల మద్దతు

రైతులకు పలు రాజకీయ పార్టీలు మద్దతుగా నిలిచాయి. రైతులు చేసే ఆందోళన కార్యక్రమాలకు సంఘీభావం తెలిపాయి. రెండు రోజుల క్రితం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్ల వెంకట్‌రెడ్డితో పాటు యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల సీపీఐ కార్యదర్శులతో పాటు పలువురు నాయకులు రైతులు సాగు చేసుకుంటున్న భూములను సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.



సంస్థాన్‌నారాయణపురం తహసీల్దార్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్)

కొందరికే డిజిటల్ పట్టాలు

రైతులు సాగు చేసుకుంటున్న భూములకు అప్పట్లో పాస్ పుస్తకాలు అందజేశారు. కానీ, ధరణి వచ్చిన తర్వాత అందరికీ డిజిటల్ పాస్ బుక్‌లు ఇవ్వలేదు. 43 మంది కుటుంబాలకు మాత్రమే ఇచ్చారు. ఇంకా 87 మందికి డిజిటల్ పాస్ బుక్స్ ఇవ్వలేదు.కొంత మందికి అసైన్ కమిటీ తీర్మానం చేసింది. మిగతా రైతులకు అసైన్ కమిటీ తీర్మానాలు చేసి ఇస్తామని చెప్పినప్పటికీ ప్రభుత్వాలు మారడం వారి పాలిట శాపంగా మారింది. సేద్యం చేసుకుంటూ పొజిషన్ మీద ఉన్నప్పటికీ అసైన్ కమిటీ తీర్మానానికి కొంత మంది రైతులు దూరం కావాల్సి వచ్చింది. పాత పాస్ పుస్తకాలు, ధ్రువీకరణ పత్రాలు మాత్రం సాగు చేసుకుంటున్న రైతులందరికీ ఉన్నాయి.

75 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నం



75 ఏళ్ల కింద మా నాయన ముత్యాలు సర్వే నంబర్ 255 భూముల్లో పంటలు సాగు చేశాడు. ఆ తర్వాత నేను సాగు చేశాను. ఇప్పుడు మా పిల్లలు కూడా సేద్యం చేస్తున్నారు. పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. బ్యాంకు రుణం తీసుకున్నాం. ధరణి వచ్చిన తర్వాత డిజిటల్ పాస్ బుక్ ఇవ్వలేదు. – చిలువేరు అంజయ్య, రైతు, సంస్థాన్‌నారాయణపురం

జీవనోపాధి పోతుంది



తరతరాల నుంచి ఇక్కడ సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. పోలీసు బెటాలియన్ ఏర్పాటు చేస్తే మా జీవనోపాధి పోతుంది. ప్రభుత్వం ప్రతిపాదన విరమించుకోవాలి. సర్వే నంబర్‌లో 255లో కొందరికే డిజిటల్ పాస్‌పుస్తకాలు ఇచ్చారు. రైతులందరికీ జారీ చేయాలి. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. – సీహెచ్. జంగయ్య, రైతు సంస్థాన్‌నారాయణపురం

ప్రతిపాదన విరమించుకోవాలి



పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేస్తే మా కుటుంబం జీవనాధారం కోల్పోతుంది. దశాబ్దాల నుంచి కబ్జాలో ఉంటున్నాం. ఇప్పుడు మా భూములు తీసుకోవడం సరియైనది కాదు. 255 సర్వే నంబర్ భూముల్లో పోలీసు బెటాలియన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన విరమించుకోవాలి. ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించాం. – బొడ్డుపల్లి మల్లయ్య, రైతు సంస్థాన్‌నారాయణపురం

నేడు ఆలేరు మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందా.. ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాలు చెత్తాచెదారంతో నిండుకపోయాయా.. డ్రైయినేజీలు, రోడ్లు సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా, అయితే మీ సమస్యలపై నేరుగా మున్సిపల్ కమిషనర్‌తో సోమవారం సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.



కె.లక్ష్మి, మున్సిపల్ కమిషనర్, ఆలేరు

తేది. 22.07.2024 సోమవారం
సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

డయల్ చేయాల్సిన ఫోన్ నంబర్ : **63004 87155**

డయాలసిస్ బాధితులకు ఊరట

- జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో పడకల సంఖ్య పెంపు
- ఇకనుంచి హైదరాబాద్‌కు వెళ్లే అవసరం లేకుండా..
- త్వరలో అందుబాటులోకి రానున్న సేవలు
- తీరనున్న బాధితుల ఇక్కట్లు



జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో సేవలు పొందుతున్న రోగులు

భువనగిరి: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రంలో పడకల సంఖ్య పెరిగింది. దీంతో కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకునే బాధితలకు సత్వర సేవలు అందనుండడంతో కాస్త ఊరట లభించనుంది. ఇప్పటి వరకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో బాధితలకు సరిపడా పడకలు లేకపోవడంతో రోగులను వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేసేవారు. అయితే పడకల సంఖ్య పెంచడంతో ఇక నుంచి డయాలసిస్ బాధితుల ఇబ్బందులు తీరనున్నాయి.

జిల్లాలో డయాలసిస్ చేసుకున్న వారు 21,145 మంది

బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో గత సంవత్సరం ఫిబ్రవరిలో యాదాదిర జిల్లాలో మూడుచోట్ల డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో 20 పడకల సౌకర్యం కల్పించారు. ఇందులో ఆలేరు సీహెచ్‌సీలో 10, చౌటుప్పల్ సీహెచ్‌సీలో 5, భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 5 పడకల చొప్పున ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ప్రత్యేకంగా ఒక పడకను హెపటైటిస్ సీ వైరస్ రోగుల కోసం కేటాయించారు. ప్రతి కేంద్రంలో నాలుగు షిఫ్టుల్లో 24 గంటలు సేవలందిస్తూ ఒక్కో రోగికి వారానికి మూడు సార్లు రక్తం శుద్ధి చేస్తున్నారు. సాధారణంగా రోజుకు 23 నుంచి 25 బాధితుల వరకు సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని మూడు సెంటర్లలో సుమారు 21,145 మంది డయాలసిస్ బాధితులకు సేవలదించారు.

సలహాలు పొందేందుకూ అవకాశం

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 2023 ఫిబ్రవరి 13న డయాలసిస్ కేంద్రాన్ని ఐదు పడకలతో ప్రారంభించారు. ఆ సమయంలో బాధితులకు ఎంతమంది వచ్చిన వారందరికీ సేవలదించేవారు. కానీ, సేవలకు సమయం ఎక్కువగా అవుతుండడంతో అంత సేపు నిరీక్షించలేక కిడ్నీ బాధితులు భయంతో హైదరాబాద్, నాంపల్లి, ఘట్కేసర్‌కు వెళ్లేవారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో 5 నుంచి 8 పడకలకు పెంచడంతో డయాలసిస్ బాధితులకు సత్వర సేవలు అందనున్నాయి. అదనంగా మూడు పడకలను ఏర్పాటు చేయడంతో పాటు కేంద్రానికి వచ్చే డయాలసిస్ బాధితులు సంబంధిత నెఫ్రాలజీ వైద్యులను వెబ్ ద్వారా మాట్లాడి సమస్యలను తెలియజేయడంతో పాటు పరిష్కారమార్గాలను కూడా పొందే అవకాశం కల్పించారు. గతంలో వైద్యులను సంప్రదించేందుకు హైదరాబాద్‌కు వెళ్లేవారు. ప్రస్తుతం ఈ సమస్య తొలగిపోయింది. కాగా జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనే ఇప్పటి వరకు 8,500 మందికి రక్త శుద్ధిని చేసినట్టు సెంటర్ నిర్వాహకులు తెలిపారు.

రోజూ 42 మందికి సేవలు

ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని డయాలసిస్ సెంటర్‌లో ఐదు నుంచి ఎనిమిది పడకలు ఉన్నాయి. రోజూ సుమారు 42 మందికి డయాలసిస్ చేస్తున్నాం. సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు వెళ్లకుండా కేంద్రం నుంచే నెఫ్రాలజీ వైద్యులను వెబ్ ద్వారా సమస్యను చెప్పడం, సలహా తీసుకుంటున్నారు.

– రాజ్‌కుమార్, డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్, భువనగిరి

యాదాద్రి క్షేత్రంలో భక్తుల ఆరాధనలు


యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవ, ఆరాధన చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. అలాగే ప్రాకారం మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను భక్తుల మధ్యన ఊరేగించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.



శ్రీసుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఎస్జీటీలను విధుల నుంచి రిలీవ్ చేయాలి

భువనగిరి : విద్యా వలంటీర్లను నియమించి బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. అదివారం భువనగిరిలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎస్ హెచ్‌ఎం పోస్టులను 10 వేలకు పెంచి బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. వీటితో పాటు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీని ప్రకటించాలని, వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో చేసిన డిప్యూటేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3వ తరగతి వరకు నిర్వహించాలనే అలోచనను విరమించుకోవాలన్నారు. రాష్ట్ర కమిటీ అడిట్ కన్వీనర్ యాకయ్య మాట్లాడుతూ జీఓ 317 వల్ల ఏర్పడుతున్న సమస్యల పరిష్కారం కోసం మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో స్కావెంజర్లను, నైట్ వాచ్‌మన్లను నియమించాలన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సంగు వనిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి మెతుకు సైదులు, రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్కెర్ల యాదయ్య, జిల్లా కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, సుధర్మారెడ్డి, రవికుమార్,రమణారావు, కరుణాకర్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

రుణమాఫీపై చర్చకు సిద్ధమా..

- 43 శాతం మందికి మించి రుణమాఫీనే కాలేదు
- కేసీఆర్, కేటీఆర్‌పై బీర్ల అయిలయ్య వ్యాఖ్యలు హేయం
- గవర్నర్‌ను కలిస్తే విమర్శలు చేస్తారా
- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

సాక్షి, యాదాద్రి : రుణమాఫీ కింద మొదటి దఫాలో రూ.లక్ష వరకు రుణం పొందిన రైతులందరికీ మాఫీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, వాస్తవంగా 43 శాతానికి మించి రుణమాఫీనే కాలేదని ఆలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రుణమాఫీపై బహిరంగ చర్చకు రావాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు సవాల్ విసిరారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆలేరు నియోజకవర్గంలో ఎంత మందికి రూ.లక్షలోపు రుణమాఫీ అయ్యిందో చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు సీఎం రేవంత్‌రెడ్డితో సహా ఎవ్వరికీ లేదన్నారు. కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చేసిన అనుచిత వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలను అభివృద్ధి చేయడంతో పాటు వందలాది ఐటీ కంపెనీలు తీసుకువచ్చి లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. అటువంటి గొప్ప వ్యక్తిపట్ల అయిలయ్య సంస్కారహీనంగా మాట్లాడటం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామిక వ్యతిరేక విధానాలపై బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా కేటీఆర్ గవర్నర్‌ను కలిశారని, దీనిపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం హేయమన్నారు.

ప్రభుత్వం.. నిరుద్యోగులనూ మోసం చేసింది

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని మోసం చేస్తుందని గొంగిడి సునీత దుయ్యబట్టారు. ఇంతర వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. మెగా డీఎస్సీ ఏమైందని ప్రశ్నించారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను ఎప్పుడూ బీఆర్‌ఎస్‌లో చేర్చుకోలేదన్నారు. అప్పటి ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పోచారం శ్రీనివాస్‌రెడ్డి తమ పదవులకు రాజీనామా చేసిన తర్వాతే కేసీఆర్ బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారని ఆమె గుర్తుచేశారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సాధిస్తేనే టీపీసీసీ వచ్చిందన్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గ్రహించాలన్నారు. సమావేశంలో ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ బీకునాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, తోటకూర అనురాధ, చామకూర గోపాల్, మాజీ ఎంపీపీ బాలమణి, యాదగిరిగుట్ట, రాజాపేట మండల పార్టీ అధ్యక్షులు కర్రెవెంకటయ్య, సట్టు తిరుమలేష్, చొల్లేరు మాజీ సర్పంచ్ తోటకూర బీరయ్య, ఆలేరు మార్కెట్‌కమిటీ మాజీ డైరక్టర్ పత్తి వెంకటేశ్, పాపట్ల నరహరి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

క్లుప్తంగా

గుట్కా ప్యాకెట్లు పట్టివేత



పట్టుబడిన గుట్కా ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

మఠంపల్లి: ఆంధ్రప్రదేశ్ నుంచి బైక్‌పై గుట్కా ప్యాకెట్లను తీసుకొస్తుండగా శనివారం రాత్రి మఠంపల్లి మండలంలోని జాన్‌పహాడ్ రోడ్ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్లకు చెందిన పాన్‌షాప్ యజమాని షేక్ నజీర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి ప్రభుత్వ నిషేధించిన గుట్కా ప్యాకెట్లు బైక్‌పై తీసుకొస్తుండగా.. మఠంపల్లి మండలం జాన్‌పహాడ్ రోడ్ శివారులో వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన గుట్కా ప్యాకెట్ల విలువ రూ.50వేలు ఉంటుందన్నారు. బైక్‌ను, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చౌటుప్పల్‌లో..

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. లక్కారం గ్రామానికి చెందిన సూరిశెట్టి శ్రీధర్ ఇంటిపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఇంట్లో నిల్వ ఉంచిన నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ రెడ్డి తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మిర్యాలగూడ టౌన్ : ముగ్గురు పేకాటరాయుళ్లను ఆదివారం మిర్యాలగూడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం అవంతీపురం వ్యవసాయ మార్కెట్ సమీపంలో గల ఖాళీ స్థలంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.1800 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో గొర్రెలకాపరి మృతి



లచ్చయ్య (ఫైల్)

త్రిపురారం: గుండెపోటుతో గొర్రెలకాపరి మృతి చెందాడు. ఈ ఘటన త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబుసాయిపేట గ్రామానికి చెందిన మోదాల లచ్చయ్య గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం గొర్రెలను మేపడానికి గ్రామ సమీపంలోని తోటి గొర్రెల కాపరులతో కలిసి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తుండగా.. గుండెలో నొప్పి వస్తుందంటూ తోటి గొర్రెల కాపారులకు చెప్పి పడిపోయాడు. దీంతో వారు లచ్చయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆస్పత్రికి తరలించే లోపే గుండెనొప్పి తీవ్రమై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

బస్సును ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

భువనగిరి క్రైం: భువనగిరి బస్టాండ్ సమీపంలో బస్సును కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్టకు చెందిన హరిప్రసాద్ మరో వ్యక్తితో కలిసి శనివారం అర్ధరాత్రి భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉన్న తన బంధువులను చూసేందుకు కారులో వెళ్తున్నారు. అదే సమయంలో బస్టాండ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న హరిప్రసాద్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును పక్కకు తొలగించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా ఆంథోల్ మైసమ్మ బోనాలు



బోనాలను ఎత్తుకొని వస్తున్న మహిళలు, యువతులు



శివసత్తుల విన్యాసాలు

చౌటుప్పల్: మండల పరిధిలోని శ్రీఆంథోల్ మైసమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రెండో రోజు చండీ హోమంతో పాటు బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానన్నారు. భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. మోహన్‌బాబు, మాజీ సర్పంచులు బొంతల ఓంప్రకాష్, ఎలువర్తి యాదగిరి, మాజీ ఎంపీటీసీ చిట్టంపల్లి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు చిలుకూరి మల్లారెడ్డి, బుర్ర స్వామి, ముదిగొండ రమేష్, గుండు శ్రీహరి, చిట్టంపల్లి జంగయ్య, ఈడ్దుల విజయ్, గంగాధర గణేష్, అత్తాపురం అంజిరెడ్డి, ఎలువర్తి రవీందర్, కంచర్ల ప్రవీణ్‌రెడ్డి, బాలగోని శ్రీకాంత్, అన్నదాన దాత కామిశెట్టి విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చింతపల్లిలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

చింతపల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు లక్ష పుష్పార్చన, పంచామృతాభిషేకం, కాగడ హారతి, సంస్థాన హారతి, మధ్యాహ్న హారతి కార్యక్రమాలతో పాటు వేద పండితులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. దేవరకొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి సాయినాథుడిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచుకంటి ధనుంజయ్య, మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, పవన్‌కుమార్, ముచ్చర్ల యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, రాంసింగ్, గోవిందుయాదగిరి, సదానందం, రాధాకిషన్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



సాయినాథుడికి పూజలు చేస్తున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ తదితరులు



సాయినాథుడిని దర్శించుకునేందుకు క్యూలో వేచిచూస్తున్న భక్తులు

జల్సాల కోసం చోరీలు.. దొంగ అరెస్ట్

- 26 తులాల బంగారం, కేజీ వెండి స్వాధీనం



ఆభరణాలను చూపుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రాము, పోలీస్ సిబ్బంది

కోదాడరూరల్ : ఇళ్లల్లో చోరీలు చేస్తున్న దొంగను కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి సీఐ రాముతో కలిసి ఆదివారం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం మామకన్ను గ్రామానికి చెందిన సయ్యద్ అల్తాఫ్ అలియాస్ అఫ్రోజ్ తల్లిదండ్రులు చిన్నతనంలో మృతి చెందారు. దీంతో అతడు తన బాబాయి వద్ద పెరిగాడు. అల్తాఫ్‌కు స్నేహితులతో కలిసి జులాయిగా తిరుగుతూ మద్యం, బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. దీంతో విలాసాలకు డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలు చేస్తూ జైలు జీవితం కూడా గడిపాడు. మార్చి 18వ తేదీన బెయిల్‌పై బయటకు వచ్చిన అల్తాఫ్ నాలుగు నెలల వ్యవధిలో కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోలీస్ స్టేషన్ పరిధిలోని 6 ఇళ్లలో, కోదాడ పట్టణంలోని మూడు ఇళ్లలో చోరీకి పాల్పడి బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించాడు. ఆదివారం కోదాడ పట్టణంలోని గోల్డ్‌షాప్ బజారులో ఆభరణాలు విక్రయించేందుకు వస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి వద్ద బంగారం, వెండి ఆభరణాలు లభ్యమవ్వడంతో అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద పోలీసులు 26 తులాల బంగారం, ఒక కేజీ నాలుగు వందల గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్, పోలీస్ సిబ్బంది యల్లారెడ్డి, సతీష్‌నాయుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



పాలకవీడు : మృతిచెందిన పాడి గేదె

పాలకవీడు: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. ఈ ఘటన పాలకవీడు గ్రామ సమీపంలోని వ్యవసాయ భూముల్లో ఆదివారం జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు గ్రామానికి పగడాల మట్టేష్ రోజు మాదిరిగా తన పాడి గేదెను ఆదివారం గ్రామ సమీపంలోని పొలాల్లోకి మేతకు తోలుకెళ్లాడు. గ్రామంలోని శ్మశాన వాటిక వద్ద గల విద్యుత్ స్టార్టర్ బాక్స్ తెగిపడి ఉండగా పాడి గేదె మేత మేసుకుంటూ వెళ్లి దానికి తగిలి విద్యుదాఘాతానికి గురైంది. విద్యుత్ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేయగా.. అప్పటికే గేదె మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రాజాపేటలో..

రాజాపేట: మండలంలోని చల్లూరు గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. చల్లూరు గ్రామానికి చెందిన రైతు గంగు రాజిరెడ్డి తన వ్యవసాయ బావి వద్ద రోజుమాదిరిగానే ఆదివారం పాడి గేదెను మేత కోసం వదలగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.1.20లక్షలు ఉంటుందని, జీవనోపాధి కోల్పోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

బావిలోకి దిగి ఊపిరాడక రైతు మృతి



లక్ష్మయ్య (ఫైల్)

మునగాల(కోదాడ): బోరు మోటారును బయటకు తీసేందుకు బావిలోని దిగిన రైతు ఊరిరాడక మృతిచెందాడు. ఈ ఘటన మునగాల మండలం కలకోవ గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కలకోవ గ్రామానికి చెందిన కొమర్రాజు లక్ష్మయ్య(52) తనకున్న ఎకరంన్నర భూమితో పాటు మరో నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న భూమిలో గతంలో బావి ఉండేది. ఇటీవల ఆ బావిని పూడ్చివేసి అందులో వేసిన బోరు చుట్టూ రెండు అడుగుల గూనలు 20 వరకు వేశాడు. ఇదిలా ఉండగా బోరు మోటారు మరమ్మతుకు గురికావడంతో లక్ష్మయ్య తన తోటి రైతు తిప్పన శేషగిరి సాయంతో ఆదివారం బావిలోకి దిగి మోటారును పైకి లాగేందుకు తాడు కడుతుండగా ఊపిరిడాక అందులోనే ప్రాణాలు వదిలాడు. బావి బయట ఉన్న శేషగిరి ఇది గమనించి వెంటనే గ్రామంలోని పలువురికి సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి దొంగరి సైదులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరకుని తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులుకు సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసులు, ఫైర్ సిబ్బందికి ఫోన్ ద్వారా విషయం చెప్పడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు బావిలోకి దిగే ప్రయత్నం చేసినప్పటికీ ఊపిరాడకపోవడంతో బయటకు వచ్చారు. దీంతో ఫైర్ సిబ్బంది, స్థానికుల సహకారంతో జేసీబీని ఉపయోగించి గూనలు తొలగించి లక్ష్మయ్య మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మయ్యకు భార్య మాత్రమే ఉంది. సంతానం లేరు. కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, ఏఎస్‌ఐ కల్లు శ్రీనివాసరెడ్డి సహాయక చర్యలను పర్యవేక్షించారు.



లక్ష్మయ్య మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది

యాదాద్రిలో తగ్గిన భక్తుల రద్దీ



భక్తులు లేక బోసిపోయిన ఉత్తర మాడ వీధి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో వచ్చారు. సికింద్రాబాద్‌లో మహంకాళి అమ్మవారికి బోనాలతో పాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో స్వామివారి చెంతకు భక్తుల రాక గణనీయంగా తగ్గింది. దీంతో స్వామి వారి ధర్మ దర్శనానికి గంట, వీఐపీ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టింది. స్వామి వారిని 30వేల వరకు భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఆదివారం కిటకిటలాడే ఆలయ పరిసరాలు.. భక్తులు లేక బోసిపోయాయి. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.25,23,042 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

నూతన విద్యా విధానాన్ని అమలు చేసే కుట్ర



మాట్లాడుతున్న నాగరాజు

కొండమల్లేపల్లి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని (ఎన్‌ఈపీ) అమలు చేసే కుట్ర చేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లిలో ఆదివారం నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ నల్లగొండ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహించాలనే ప్రతిపాదనతో విద్యారంగానికి నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని, విద్యారంగ సమస్యలపై సీఎం విద్యార్థి సంఘాలతో సమావేశమై చర్చించాలన్నారు. ఈ సమావేశంలో లక్ష్మీనారాయణ, ఖమ్మంపాటి శంకర్, కుంచం కావ్య, లక్ష్మణ్‌నాయక్, వెంకటేష్, సైదానాయక్, కోరే రమేస్, రవీందర్, హర్షవర్ధన్, స్పందన తదితరులు పాల్గొన్నారు.

మహిళా కూలీలను ఢీకొట్టిన టాటా ఏస్

- ముగ్గురికి గాయాలు

కోదాడరూరల్: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళా కూలీలను టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కోదాడ మండలం దొరకుంట శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దొరకుంట గ్రామానికి చెందిన మహిళా కూలీలు నాట్లు వేసేందుకు విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం వారిని గ్రామ శివారులో ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సుంకరి రాజ్యలక్ష్మి, దొంగరి రమాదేవి, ఎర్రంశెట్టి కావ్యకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజ్యలక్ష్మికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కోదాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుల కుటుంబ సభ్యులు కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పెద్దఅడిశర్లపల్లి: బైక్‌పై వెళ్తూ ఆర్టీసీ బస్సును ఢీకొట్టి యువకుడు దుర్మరణం చెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం కోనమేకలవారిగూడెం గ్రామ స్టేజీ సమీపంలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాలకు చెందిన లింగంపల్లి కొండల్(19) పెద్దవూర మండలం పులిచర్లలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. పని నిమిత్తం ఆదివారం తన బావమరిది వాకిటి అజయ్‌తో కలిసి బైక్‌పై పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్ వద్దకు వచ్చి తిరిగి పులిచర్లకు వెళ్తుండగా.. పెద్దఅడిశర్లపల్లి మండలం కోనమేకలవారిగూడెం గ్రామ స్టేజీ సమీపంలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై దేవరకొండ నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కొండల్ అక్కడికక్కడే మృతి చెందగా, అజయ్‌కి తీవ్రగాయాలయ్యాయి. అజయ్‌ని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సూర్యక్షేత్రంలో భక్తుల ప్రత్యేక పూజలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అదేవిధంగా క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, పాలెల్లి వెంకటేశ్వర్లు, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

గంజాయి పట్టివేత.. ఐదుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని మల్లికార్జున రైస్ మిల్లు సమీపంలో గల వెంచర్‌లో కొందరు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్, పోలీస్ సిబ్బందితో కలిసి దాడులను నిర్వహించారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో పనిచేసేందుకు బిహార్ రాష్ట్రం నుంచి వచ్చిన రాంచంద్రమహార, సునీల్ ప్రసాద్‌తో పాటు సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం సాదుతండాకు చెందిన ధారవత్ ముఖేష్, పాలకీడు మండలం మీగడంపాడుతండాకు చెందిన మాలోతు సంతోష్, మఠంపల్లి మండలం మచ్చతండాకు చెందిన రూపావత్ సాయికుమార్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 100 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన ఎస్‌ఐ రవీందర్‌నాయక్, ఏఎస్‌ఐ సైదులు, పోలీసు సిబ్బంది సురేష్, వెంకట్, జుబేరీపాషా, మతిన్‌ను సీఐ అభినందించారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య



నవీన్ కుమార్ (ఫైల్)

బొమ్మలరామారం: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీకటిమామిడి గ్రామానికి చెందిన కదారి నవీన్ కుమార్(32) వృత్తిరీత్యా కటింగ్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అతడు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తన ఆరోగ్యం కుదుటపడటం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన నవీన్ కుమార్ ఆదివారం తెల్లవారుజామున తన ఇంట్లో చీరతో ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి భార్య కదారి భాగ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

ఏడు కోడెదూడల పట్టివేత

కోదాడరూరల్: అక్రమంగా తరలిస్తున్న ఏడు కోడెదూడలను ఆదివారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతల నుంచి పశువుల వ్యాపారం చేసే జిడ్డు నాగరాజు ఏడు కోడెదూడలను వాహనంలో కోదాడ సంతకు తరలిస్తుండగా.. రామాపురం క్రాస్ రోడ్‌లో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన దూడలను కట్టంగూరులోని గోశాలకు తరలించి డ్రైవర్ ప్రకాష్‌రావుతో పాటు పశువుల వ్యాపారి నాగరాజుపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి.. సకల ఔషధాల నిధి



మాట్లాడుతున్న ప్రకృతి వైద్యుడు రామచంద్రరావు



సదస్సుకు హాజరైన ప్రజలు

- ప్రకృతి వైద్యుడు రామచంద్రరావు

రామగిరి(నల్లగొండ): ప్రకృతి సకల ఔషధాల నిధి అని సిద్దార్థ యోగా విద్యాలయం, ప్రకృతి వైద్యుడు కేవై రామచంద్రరావు అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, సిద్దార్థ యోగా విద్యాలయం సంయుక్తంగా నల్లగొండ పట్టణంలోని చినవెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన 'ప్రకృతి జీవన విజ్ఞానం' ఆరోగ్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రకృతిపై అవగాహన ఉంటే చిన్న చిన్న రోగాలను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా దూరం చేసుకోవచ్చన్నారు.యోగా, మెడిటేషన్‌తో పాటు జొన్నలు, రాగులు, మినుములు వంటి మిల్లెట్స్‌ను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఇలాంటి సదస్సులు నిర్వహించిన గాంధీ గ్లోబల్ ఫ్యామిలీకి అభినందనలు తెలిపారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణుడు ఎన్‌జీ పద్మ మాట్లాడుతూ.. సిద్దార్థ యోగా విద్యాలయం రూపొందించిన డైట్ షీట్‌ను దైనందిక జీవితంలో అలవాటు చేసుకోవాలని అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థల ద్వారా ఆరోగ్య సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి సుమారుగా 1200 పైగా ప్రముఖులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యావేత్తలు, విద్యార్థులు, క్రీడాకారులు, యువతీయువకులు హాజరయ్యారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డాక్టర్స్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్ ఏమూరి శైలజ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు బొమ్మపాల గిరిబాబు, పాముల అశోక్, లోకనబోయిన రమణ, గిరిధర్‌రావు, నాగమణిరెడ్డి, ముక్కామల నరసింహ, ఎండీ అజీజ్, దశరథగౌడ్, పజ్జూరి రవీందర్‌రెడ్డి, ప్రముఖ పర్యావరణవేత్త మిట్టపల్లి సురేష్‌గుప్తా, ట్రస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోడి శ్రీనివాస్, జీవీ రావు తదితరులు పాల్గొన్నారు.